క్లుప్తంగా

ఘనంగా డాక్టర్స్ డే



ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌ను అభినందిస్తున్న ఫోరెన్సిక్ విభాగం వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఏఓ డాక్టర్ నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ శైలేష్‌కుమార్‌ను కార్యాలయ ప్రోగ్రామ్ అధికారులు, ఉద్యోగులు సన్మానించారు.

కేఎంసీలో..

కర్నూలు మెడికల్ కాలేజీలో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్‌లకు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అభినందనలు తెలిపారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుని కేక్ కట్ చేశారు.

గ్రామ సభల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. రవికుమార్, దేశాయి చంద్రన్న కోరారు. ఈ మేరకు వేదిక నేతలు శనివారం స్థానిక జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి గీతాప్రతిమను కలిసి వినతి పత్రం అందించారు. గ్రామ సభల్లో అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనేలా ఉత్తర్వులు జారీ చేయాలని, హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో వేదిక కోశాధికారి కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఈరన్న, వై. సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం



సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): డోన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది శీలం భాస్కర్ నాయుడుపై గత నెల 29వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి/ బోయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు కుబేరస్వామి, జె. శ్రీనివాసులునాయుడు, తలారి కృష్ణమనాయుడు, చిత్రసేనుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని భాస్కర్‌నాయుడు డోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దాడికి పాల్పడ్డ వారిని గుర్తించి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో నాయకులు అనుగొండ రంగముని, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



డాక్టర్ చంద్రశేఖర్‌కు పురస్కారం అందజేసి సన్మానిస్తున్న సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి. చంద్రశేఖర్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని యాక్ట్ నవ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. దీనిని శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ సెంటర్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్ర, సెక్రటరీ డాక్టర్ మూర్తి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

శ్రామిక మహిళలు సంఘటితం కావాలి

కర్నూలు (రూరల్): జిల్లాలో వివిధ సంస్థల్లో పని చేస్తున్న శ్రామిక మహిళలు సంఘటితం కావాలని సీఐటీయూ జిల్లా నాయకులు సాయిబాబా పిలుపునిచ్చారు. శనివారం కేకే భవనంలో ఏపీఎస్‌ఆర్‌టీసీ సంస్థలో పని చేస్తున్న శ్రామిక మహిళల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబా ప్రైవేట్ స్కూళ్లు, హాస్పిటళ్లు, షాపింగ్ మాల్‌లల్లో పనిచేస్తున్న శ్రామికులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. హక్కుల సాధనకు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్‌టీసీ స్వీపర్ యూనియన్ నాయకులు దేవరాజు, నరసింహులు,గోపాలు, రేణుకమ్మ, ప్రమీలమ్మ, నరసమ్మ, ఈశ్వరమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి
- కార్యక్రమం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ సృజన
- పలువురికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు అందజేత



పంచలింగాలలో యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు (టౌన్): ' ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన 99 శాతం మందికి అందించాం. మిగిలిన 1 శాతం మందిని గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న'ట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆమె చెప్పారు. శనివారం స్థానిక ధర్మపేటలోని 121 సచివాలయం ప్రాంగణంలో జగనన్న సురక్షను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జూలై 30 వ తేదీ వరకు కర్నూలులోని ప్రతి సచివాలయం పరిధిలో సర్వే నిర్వహించి సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న వారిని గుర్తిస్తామన్నారు. అలాగే 11 రకాల సర్వీసుల సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఎవరికైనా అర్హత ఉండి ప్రభుత్వం పథకం లేదా సర్టిఫికెట్లు అందకపోతే సచివాలయ సిబ్బంది అందేలా చర్యలు తీసుకుంటారన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం కింద సచివాలయ పరిధిలో అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించేందుకు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే సచివాలయాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఈ విషయంలో కుల మతాలు, పార్టీలు చూడటం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, కార్పొరేటర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిమోహన్ రెడ్డి, రైల్వే ప్రసాద్, కార్పొరేటర్ క్రిష్ణకాంత్, కేదార్‌నాథ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు సీహెచ్. మద్దయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న బి. చందు, కె. అనసూయమ్మకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఆలేఖ్య, కె. అమినాబీ, మాధురిలకు ఆదాయ, నలుగురికి జనన ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ అందజేశారు.

14వ సచివాలయంలో...

నగరపాలక సంస్థ పరిధిలోని బొంగుల బజారులోని 14 వ సచివాలయం, మామిదాల పాడులోని 98 వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ హాజరై మాట్లాడుతూ జగనన్న అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి, రెవెన్యూ ఆఫీసర్ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మున్సూర్ పాల్గొన్నారు.

పంచలింగాలలో..

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. శనివారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు ఆదాయ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, ఈఓఆర్‌డీ నాగేశ్వర రెడ్డి, తహసీల్దార్ శివరాముడు, వైస్ ఎంపీపీ-2 నెహేమ్యా, అలాగే బి. తాండ్రపాడు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ అజామ్‌ఖాన్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ మోహన్ పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలం చిన్నటేకూరులో నిర్వహించిన జగనన్న సురక్షలో డీఎల్‌పీఓ తిమ్మక్క, తహసీల్దార్ టీపీ రమేష్‌బాబు, సర్పంచ్ టి.లక్ష్మన్న కె. మార్కాపురంలో గ్రామంలో ఎంపీడీఓ రమణామూర్తి, డిప్యూటీ తహశీల్దార్ గిరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలి

- సెర్ప్ సీఈఓ ఇంతియాజ్



ఉల్లి సోలార్ డ్రయర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

కల్లూరు: ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధితో జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ అన్నారు. శనివారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో కూరగాయల సోలార్ డ్రయర్ల యూనిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఉల్లి సోలార్ డ్రయర్ యూనిట్‌ను ప్రారంభించి మాట్లాడారు. యూనిట్ విలువ లక్ష రూపాయలు కాగా అందులో సబ్సిడీ రూ. 35వేలు ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి 40వేల యూనిట్లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాహెరాబీ, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, పొదుపు సంఘం సభ్యురాలు జుబేదాబీ, వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సమయానుసారంగా ఆరోగ్యసేవలందించాలి



కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఏఎన్‌ఎం, ఆశాల సమన్వయంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలోని ఆరోగ్యసేవలను ఎంఎల్‌హెచ్‌పీలు సమయానుసారంగా రోగులకు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పాము, తేలు, కుక్కకాటుకు ప్రథమ చికిత్స, రోడ్డు ప్రమాద కేసులకు సత్వర ప్రథమ చికిత్సలు అందించి పై ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం గురించి శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోని పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించి ఆ వివరాలను హెచ్‌డబ్లూసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, నోడల్ ఆఫీసర్లు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, సరళ, అరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

లంబాడీలు హక్కులు సాధించుకోవాలి

కర్నూలు (న్యూటౌన్) : లంబాడీలు రాజ్యాంగం కల్పించిన హక్కులు సాధించుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాస్ నాయక్ అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ఖేతావత్ లక్ష్మణ్ నాయక్, నేణావత్ రాము నాయకుల ఆధ్వర్యంలో నందనపల్లి సుగాలి తండాలో ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను కైలాస్ నాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. లంబాడీల జీవితాలు బాగు చేయడానికి తాము సంఘాన్ని స్థాపించామన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవావత్ శంకర్ నాయక్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయ నాయక్, యువకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి గోశాల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మాణిక్యమ్మ(65) మృతి చెందారు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన పాండు రంగారెడ్డి, మాణిక్యమ్మ దంపతులు కొన్ని సంవత్సరాలుగా దిన్నెదేవపాడు గ్రామ పరిధిలోని స్కంద సెంట్రల్ స్టోర్‌లో పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. శనివారం ఇంట్లోకి సరుకులు తెచ్చుకోవడానికి టీవీఎస్ ఎక్స్ఎల్ బండిపై కర్నూలుకు బయలుదేరారు. 44వ జాతీయ రహదారి గోశాల దగ్గర రోడ్డుకు ఎడమ వైపున వెళ్తుండగా హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీ కొట్టగా వారు ఎగిరి కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి రక్త గాయాలుకాగా 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాణిక్యమ్మ ప్రాణాలు కోల్పోగా పాండు రంగారెడ్డి చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు గురుపూర్ణిమ వేడుకలు

కర్నూలు కల్చరల్: నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని సరస్వతి నగర్‌లోని శివదత్త సాయి బాబా మందిరంలో ఈనెల 3వ తేదీ గురుపూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, సాయంత్రం పల్లకీ సేవ సాయి నామ భజన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

మున్సిపల్ హైస్కూల్‌లో గెట్ ఇన్ టు రగ్బీ

కర్నూలు(రూరల్): నగరంలోని దామోదరం మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థులకు గెట్ ఇన్ టు రగ్బీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ... క్రీడలు శారీరక పెరుగుదలకు దోహదం చేస్తాయన్నారు. నిరంతర సాధన ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సుధీర్, కేర్ టేకర్ అజిత్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

కర్నూలు(సెంట్రల్): హింసాకాండతో అల్లాడిపోతున్న మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌యూసీఐ(సీ) సీనియర్ నాయకులు నాగన్న డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మణిపూర్‌లో 43 రోజులుగా జరుగుతున్న హింసలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఆస్తులు ధ్వంసమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేంద్రసింగ్ రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో నగర ఇన్‌చార్జ్ తేజోవతి, సభ్యులు ఖాదర్, బాబు, శక్రప్ప, వెంకటేస్, సామాజిక కార్యకర్త సాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తాం

కర్నూలు(రూరల్):జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తామని డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదోని ఇన్‌చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఖాసీం వలి ఆధ్వర్యంలో పుట్టపాశం గ్రామానికి చెందిన మల్లికార్జున, హనుమంతుతో పాటు 50 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సుధాకర్ బాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం

కర్నూలు(రూరల్): సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమైనదని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కేకే భవన్‌లో ఆ కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శౌరీలు, ప్రముఖ వ్యాపారవేత్త వహీద్ హుసేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు జబ్బు చేస్తే డాక్టర్లు నయం చేస్తారు. సమాజానికి జబ్బు చేస్తే కమ్యూనిస్టులు బాగు చేస్తారన్నారు. అనంతరం వైద్యులు డాక్టర్ నాగభూషణం, డాక్టర్ భరత్, డాక్టర్ పర్వీన్, డాక్టర్ సంధ్య, డాక్టర్ వినోద్‌ను శాలువ, మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు నిర్మల, అలివేలు, బసవయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్య ప్రాజెక్టులతో విస్తృత పరిజ్ఞానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐట్రిపుల్‌ఈ సొసైటీ హైదరాబాద్ విభాగం ప్రతినిధి

కర్నూలు సిటీ: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఐట్రిపుల్‌ఈ) సంస్థలో భాగస్వామ్యం పొందిన కాలేజీల విద్యార్థులతో కలిసి చేసే ప్రాజెక్టుల ద్వారా విస్తృత పరిజ్ఞానం పెరుగుతుందని ఆ సంస్థ హైదరాబాద్ విభాగం ప్రతినిధి డా.తారా సాయికుమార్ అన్నారు. ఈ సంస్థలో భాగస్వామ్యం కలిగిన జి.పుల్లయ ఇంజినీరింగ్, రవీంద్ర ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన 22 శాఖల కార్యకలాపాలను శనివారం ప్రారంభించారు. కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐట్రిపుల్‌ఈ సొసైటీ హైదరాబాద్ విభాగం ప్రతినిధి అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఐట్రిపుల్‌ఈ అనంతరం విభాగం ప్రతినిధి డా.వైవీ సుబ్బారెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

కర్నూలు (రూరల్): నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో ఇంటి నెంబర్ 49/50ఎ-232 నుంచి 49/50ఎ-253 సీఎస్‌ఐ చర్చి వరకు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు నరసింహులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శనివారం కాలనీ వాసులతో కలిసి వార్డ్ సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుధాకర్, శేషంరాజు, కాలనీ వాసులు శ్రీనివాసులు,రాజు, గంగాధర్, తిమ్మప్ప, పాండు పాల్గొన్నారు.

తొలిరోజు 89.47 శాతం పెన్షన్ల పంపిణీ



అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శాంతి అనే మహిళకు వితంతు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోత్స్న



24 వ సచివాలయం పరిధిలో వీరయ్యకు వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ షేక్ యూనస్‌బాషా, వలంటీర్ సమీర్

కర్నూలు (టౌన్) : నగర పాలక సంస్థ పరిధిలో శనివారం పెన్షన్ల పంపిణీ చురుగ్గా చేపట్టారు. నగరంలోని 52 వార్డుల పరిధిలో ఉన్న 133 సచివాలయాల్లోని పెన్షనర్లకు ఉదయం 6 గంటల నుంచే వలంటీర్లు పంపిణీ ప్రారంభించారు. నగరంలో అన్ని రకాల పెన్షన్లు 32,349 ఉన్నాయి. ఒక్క రోజే 28,943 మందికి పెన్షన్లు పంపిణీ చేసి 89.47 శాతం నమోదు చేశారు. ఈ సందర్భం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ మొదటి రోజు నగరంలో రూ.8.13 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. నగరంలోని ఉస్మానియా కళాశాల సమీపంలోని 10 వ వార్డులో స్థానిక కార్పొరేటర్ యూనస్ బాషా ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు.

అవీ-ఇవీ

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్):కర్నూలు నగరంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద చేపట్టే విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా బాబు జగ్జీవన్ రామ్ నగర్, గిప్సన్ కాలనీ, ఈశ్వర్ నగర్, నరసింహరావు పేట, ఈసీఎం కాంపౌండ్, సంకల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

గాతరహే మేరదిల్

కర్నూలు కల్చరల్: హైదరాబాద్, బెంగళూరు కళాకారులతో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గాతరహే మేరదిల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గాయనీ గాయకులు హైదరాబాద్‌కు చెందిన అలీ అబ్బాస్, బెంగళూరుకు చెందిన నబీబేగ్, రాయచూర్‌కు చెందిన ఇక్బాల్, కర్నూలుకు చెందిన విజయలక్ష్మి, ఫయూమ్ పాటలు ఆలపించనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): కొత్తగా ఏర్పాటైన నంద్యాల జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డు చైర్‌పర్సన్, మెంబర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమం, సంస్కరణ సేవల శాఖ పర్యవేక్షకుడు వైఎల్ ఎన్ దివాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత ఫార్మెట్‌లో జూలై 13వ తేదీలోపు విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాల కోసం WDCW.AP.GOV.IN అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పరిహారం చెల్లించాలి

కర్నూలు(రూరల్): గత సంవత్సరం ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు బీమా పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో దాదాపు 2 లక్షల హెక్టార్లలో పత్తి పంట వేసి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారన్నారు.